సాక్షి నారాయణపేట

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024

సీఎం పరామర్శ



గుండెపోటుతో మృతి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు సతీష్‌కుమార్ కుటుంబాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరామర్శించారు. శనివారం మద్దూరులో సతీష్ తల్లిదండ్రులు శివరాజ, శాంతమ్మ, భార్య సంగీత, ఇతర కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

- మద్దూరు

మారనున్న పేట దశ



నారాయణపేట పట్టణ వ్యూ

అర్బన్ అథారిటీగా నారాయణపేట

- జీఓ నంబర్ 169 ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 'నుడా'తో నగరం విస్తరణ.. ప్రగతి పరుగులు
- వలసలకు ఫులిస్టాప్.. మౌలిక సదుపాయాలు, ఉద్యోగ అవకాశాలు మెరుగు

నారాయణపేట: నాడు వలసల జిల్లాగా పేరొందిన నారాయణపేట జిల్లా రూపురేఖలు మారి ఇక ప్రగతిలో పరుగులు పెట్టనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నారాయణపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా ఎంపిక చేస్తూ జీఓఎంఎస్ నంబర్ 169ను జారీ చేసింది. నారాయణపేట జిల్లాలోని మూడు మున్సిపాలిటీలైన మక్తల్, నారాయణపేట, కోస్గిలతో పాటు 245 గ్రామాలను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మాస్టర్ ప్లాన్‌తో 'నుడా' మహర్దశ

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఒక ప్రణాళిక నిర్ధారించడానికి ఏర్పాటు చేయబడ్డాయి. ప్రధాన నగరాల చుట్టూ సమగ్రమైన, ప్రణాళికాబద్ధమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణాలు తద్వారా పరిధి ప్రాంతాలు పరిసర ప్రాంతాలలో పట్టణీకరణ వృద్ధి చెందుతుంది. సగ్రమైన మాస్టర్ ప్లాన్‌తో రహదారి నెట్‌వర్క్, నీటి సరఫరా, ఉపాధితో పాటు, శాటిలైట్ టౌన్‌షిప్‌ల అవకాశాలు లభించనున్నాయి. పట్టణీకరణ పరంగా భవిష్యత్తు ఉంటుంది. ఈ దిశగా నారాయణపేట ప్రాంతాలకు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ప్రాంతాల్లో స్థానికంగానే అన్ని వర్గాల ప్రజలకు ప్రైవేట్, కార్పొరేట్ సెక్టర్లలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. దీంతో జీవనోపాధి కోసం ముంబాయి, పూణే, హైదరాబాద్, బెంగుళూర్ ప్రాంతాలకు ఈ ప్రాంత ప్రజలు వలస వెళ్లాల్సిన అవసరం లేదు.

జిల్లా వివరాలిలా..

మున్సిపాలిటీలు:	మొత్తం
నారాయణపేట, మక్తల్, కోస్గి	గ్రామాలు : 245

మండలాలు: కోస్గి, మద్దూర్, దామరగిద్ద, ధన్వాడ, మరికల్, ఊట్కూర్, మక్తల్, మాగనూర్, గుండుమాల్, కొత్తపల్లి, నారాయణపేట



నుడా చైర్‌పర్సన్‌గా కలెక్టర్

అధికారాల అమలులో తెలంగాణ పట్టణ ప్రాంతాల అభివృద్ధి చట్టం, 1975 తెలంగాణ గవర్నర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రాంతం కోసం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయడం జరుగుతుంది. నారాయణపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్, వైస్–చైర్‌పర్సన్ సభ్యులు ఉంటారు. కలెక్టర్ చైర్‌పర్సన్‌గా, అదనపు కలెక్టర్ వైస్ చైర్మన్‌గా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి / ప్రధాన కార్యదర్శి /ప్రభుత్వ కార్యదర్శి, ఆర్థిక శాఖ లేదా అతని నామినీ, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అతని నామినీ, డైరెక్టర్ ఆఫ్ టౌన్ – కంట్రీ ప్లానింగ్ అతని నామినీ సభ్యుడుగా నియమిస్తారు.

మాట నిలబెట్టుకున్న సీఎం



ఎన్నికల సమయంలో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి మాట ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నారాయణపేట,కొడంగల్‌ను సికింద్రాబాద్, హైదరాబాద్‌లా అభివృద్ధి చేస్తామని. దీంతో ప్రజలు పట్టం కట్టారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారు. ఇచ్చిన మాట ప్రకారం నారాయణపేట జిల్లాను ప్రగతిలో పరుగులు పెట్టించేందుకు నుడాను ఏర్పాటు చేశారు. ఇకపై జిల్లా రూపురేఖలే మారనున్నాయి. ఇందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– చిట్టెం పర్ణికారెడ్డి, ఎమ్మెల్యే, నారాయణపేట

ప్రత్యేక కృతజ్ఞతలు



జిల్లాలో మూడు మున్సిపాలిటీలతో పాటు 245 గ్రామాలను కలుపుతూ వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి నూడా ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. నూడా ఏర్పాటు నిధుల వరదతో పట్టణ ప్రాంతాలకు దీటుగా గ్రామీణ ప్రాంతాలు సైతం అభివృద్ధిలో పరుగులు తీస్తాయి. నూడాను ఏర్పాటు చేసిన సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే మక్తల్

అభివృద్ధికి అడుగులు



ఎన్‌యూడీఏని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అభివృద్ధికి అడుగులు పడ్డాయి. ఎమ్మెల్యేలు ఫర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి కృషి వల్ల సీఎం రేవంత్‌రెడ్డి 'నూడా' ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీఎంకు ఎమ్మెల్యేలకు జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు.

– గందె అనసూయ, మున్సిపల్‌చైర్‌పర్సన్, నారాయణపేట



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు పారుతున్న వరద నీరు (ఫైల్)

ప్రాజెక్టు నిర్మాణ వ్యయం (రూ. లక్షల్లో)	84
13 గేట్ల నిర్మాణ వ్యయం (రూ. లక్షల్లో)	91
ఎత్తిపోతల పథక వ్యయం (రూ. కోట్లల్లో)	359

కోయిల్‌సాగర్ @ 70

పాలమూరుకు వరప్రదాయినిగా మారిన ప్రాజెక్టు

- రెండు గుట్టల అనుసంధానంగా కట్ట నిర్మాణం
- నిజాం హయాంలో శంకుస్థాపన.. 1954లో పూర్తి ప్రారంభం
- రిజర్వాయర్ కంటే.. ఎత్తిపోతల పథకానికే అధిక నిధులు
- 9 వేల నుంచి 50,250 ఎకరాలకు పెరిగిన ఆయకట్టు

దేవరకద్ర: పాలమూరు జిల్లాకు వరప్రదాయినిగా మారిన కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిర్మించి ఇప్పటికి 70 ఏళ్లు పూర్తయింది. 1947 సంవత్సరంలో అప్పటి నిజాం ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. 1.20 టీఎంసీల నీటి సామర్థ్యంతో 26.6 అడుగుల ఎత్తు అలుగు ఉండే విధంగా ప్రాజెక్టును 1954లో పూర్తిచేసి మొదటిసారి 9 వేల ఎకరాలకు సాగునీరు అందించారు. ఆ తర్వాత 1984లో ఎమ్మెల్యే వీరారెడ్డి హయాంలో రూ.91 లక్షల వ్యయంతో మరో 6 అడుగుల మేర కట్ట ఎత్తు పెంచి 13 గేట్లను అమర్చారు. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులకు పెరగగా.. నీటి నిల్వ సామర్థ్యం 2.27 టీఎంసీలకు చేరింది. ఆయకట్టు కుడి కాల్వ కింద 9 వేల ఎకరాలు, ఎడమ కాల్వ కింద 3 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తూ వచ్చారు. 2004లో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా రూ.359 కోట్లతో కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకానికి 2006లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ప్రాజెక్టు ఆయకట్టును 50,250 ఎకరాలకు పెంచుతూ జూరాల నుంచి కృష్ణాజలాలను కోయిల్‌సాగర్‌కు తరలించేలా రూపకల్పన చేశారు. ఐదేళ్లలో పూర్తి కావాల్సిన ఈ పనులు పదేళ్లు పట్టడంతో నిర్మాణ వ్యయం రూ.450 కోట్లకు పెరిగింది. ప్రస్తుతం జూరాల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ప్రాజెక్టుకు నీటిని పంపింగ్ చేస్తున్నారు.



కొనసాగుతున్న ప్రాజెక్టు నిర్మాణ పనులు (ఫైల్)



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పనులకు 1947లో శంకుస్థాపన చేస్తున్న దృశ్యం (ఫైల్)



నిర్మాణం కోసం ఉపయోగించిన పరికరాలు

సండే స్పెషల్

జిల్లాలో ఏకైక ప్రాజెక్టు..

జిల్లాల విభజన తర్వాత మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న ఏకైక ప్రాజెక్టు కోయిల్‌సాగర్. గతంలో చిన్ననీటి తరహా ప్రాజెక్టుగా ఉండగా ఎత్తిపోతల పథకం ప్రారంభమైన తర్వాత భారీ నీటి పారుదల శాఖ కిందకు చేర్చారు. సాగునీటితోపాటు పాలమూరుకు తాగునీరు అందించేలా పథకం రూపకల్పన చేశారు. అలాగే నారాయణపేట జిల్లా, కొడంగల్ ప్రాంతానికి సైతం తాగునీటి వనరుగా ఉపయోగిస్తున్నారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద దేవరకద్ర నియోజకవర్గంలోని దేవరకద్ర, చిన్నచింతకుంట మండలాలు ఉండగా నారాయణపేట నియోజకవర్గంలోని మరికల్, ధన్వాడ మండలాలకు సాగునీరు అందిస్తున్నారు. మక్తల్ నియోజకవర్గంలోని నర్వ, అమరచింత మండలాల పరిధిలోని కొన్ని గ్రామాలకు సాగునీరు అందుతుంది. అలాగే ప్రాజెక్టు కాల్వల ద్వారా గొలుసు కట్టు చెరువులను నింపుతున్నారు. ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ నుంచి దేవరకద్రకు గ్రావిటీ కెనాల్ నిర్మాణంతో 11 గ్రామాలకు సాగునీరు అందించడానికి ఏర్పాట్లు చేశారు. ఒకపక్క సాగునీరు.. మరోపక్క తాగునీరు, ఇంకో పక్క గొలుసు కట్టు చెరువులను నింపడానికి కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది.

చెక్కు చెదరని నిర్మాణం



77 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ప్రాజెక్టు నమూనా

1947– 54 మధ్య కాలంలో నిర్మించిన కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నేటికీ చెక్కు చెదరని స్థితిలో ఉంది. కోయిలకొండ కోట సమీపంలో ఉండడం వల్ల ప్రాజెక్టుకు కోయిల్‌సాగర్ అని పేరు పెట్టారు. రెండు గుట్టల మధ్య ప్రాజెక్టును పటిష్టంగా సున్నం, గచ్చును ఉపయోగించి నిర్మించారు. కట్టకు రెండు వైపులా రాతి గోడ నిర్మాణం చేసి బయట నుంచి మట్టితో నింపారు. ఇక అలుగును కూడా సున్నం గచ్చును ఉపయోగించారు. అప్పట్లో ఉపయోగించిన పరికరాలు ఇప్పటికీ ప్రాజెక్టు సమీపంలోనే పడి ఉన్నాయి. ప్రాజెక్టును 10 జూలై 1954లో అప్పటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి కేఎం ఖార్జు ప్రారంభించి ఆయకట్టుకు నీటిని వదిలారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల చిన్నబొల్లారం, పెద్దబొల్లారంతోపాటు మరో రెండు చిన్న గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఆయా గ్రామాల ముంపు బాధితులు ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఇళ్లను నిర్మించుకోవడంతో కొత్తగా బొల్లారం పేరుతో గ్రామం ఏర్పడింది.

పర్యాటకానికి అనుకూలం..

అందమైన కొండల మధ్య నిర్మించిన కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పర్యాటకానికి ఎంతో అనుకూలంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో పర్యాటక కేంద్రంగా మార్చడానికి ప్రయత్నాలు జరిగాయి. ప్రాజెక్టులో బోటును సైతం ఏర్పాటు చేశారు. హరిత హోటల్, కాటేజీల నిర్మాణం చేపట్టడానికి రూపకల్పన చేసి వదిలివేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఏకో టూరిజం పేరుతో కోయిల్‌సాగర్‌ను అభివృద్ధి చేస్తామని ఇటీవల రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమం చేపట్టారు. రూ.3 కోట్లు పర్యాటక రంగ అభివృద్ధికి మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. దీంతోపాటు నియోజకవర్గంలోని కురుమూర్తిస్వామి ఆలయం, సరళాసాగర్ ప్రాజెక్టును కలుపుకొని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.



కట్ట నిర్మిస్తున్న ఆనాటి కూలీలు (ఫైల్)

న్యూస్‌రీల్

సమాజాభివృద్ధిలో ముందుండాలి

ధన్వాడ: సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యత కలిగిన పౌరిడిగా ముందుకు పోవాలనే ఉద్దేశంతో తాను ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టానని డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. రిటైర్ట్ డీఈఓ విజయ్‌కుమార్ నిర్వహిస్తున్న పాదయాత్ర శనివారం ధన్వాడకు చెరుకోగా.. ఆయనకు విద్యార్థులు, గ్రామస్తులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలుర ఉన్నత పాఠశాలలోని గాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. యువకులు గంజాయి, డ్రగ్స్, మద్యానికి బానిసలవుతూ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, ఇకనైనా వాటికి దూరంగా ఉంటూ సమాజ బాగుకోసం కృషి చేయాలని సూచించారు. అలాగే రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ హెచ్ఎం రమేష్ శెట్టి, బాలస్వామి, బీజేపీ నాయకులు ఉదయ బాను, రాంచంద్రయ్య, గోవర్దన్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ ఉమేష్, రామకృష్ణ, ప్రిన్సిపల్ అబ్దుల్ ముజీద్, సుభాషిని పాల్గొన్నారు.



608.834 మి.యూ. విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతోందని.. శనివారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ సూరిబాబు తెలిపారు. ఎగువ 5 యూనిట్ల నుంచి 196 మెగావాట్లు, 313.486 మి.యూ.. దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 295.348 మి.యూ. ఉత్పత్తి చేపట్టామన్నారు. రెండింటి నుంచి ఇప్పటి వరకు 608.834 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని.. ఇందుకుగాను 36,887 క్యూసెక్కుల నీటిని వినియోగించినట్లు వివరించారు.

ఓటరు జాబితాకు సహకరించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా రూపకల్పన
- కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: అనర్హులు లేని ఓటరు జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో రాజకీయ పార్టీల నాయకులతో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమీక్షించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా జాబితా రూపకల్పన జరగాలని ఆమె తెలిపారు. ఎలక్టోరల్ రోల్ ముసాయిదా ప్రచురణ 29.10.2024 (మంగళవారం, ఎలక్టోరల్ రోల్ చివరి ప్రచురణ 06.01 ఉంటుందని, దీనికి సంబంధించి క్లెయిమ్‌లు, అభ్యంతరాల వ్యవధిలోపు ప్రత్యేక ప్రచార దినాలను నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. బీఎల్ఓలు సంబంధిత పోలింగ్ స్టేషన్‌లో ఉదయం 10:00 గంటలకు హాజరు కావాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వ్యక్తులందరికీ ఓటరు నమోదు నిర్ధారించబడుతుందన్నారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ ప్రచురణ తర్వాత జాబితాలో పేర్లు రాని వాళ్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు.

మహిళాశక్తి లక్ష్యాన్ని అధిగమించాలి

జిల్లాలో మహిళా శక్తి కార్యక్రమాల లక్ష్యాన్ని అధిగమించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల ఆధ్వర్యంలో గ్రామీణాభివృద్ధి శాఖ కార్యక్రమాల పై సమీక్ష నిర్వహించారు. మహిళా శక్తి, ఇనిస్టిట్యూషన్ బిల్డింగ్, బ్యాంకు లింకేజీ, సోషల్ సెక్యూరిటీ, శ్రీనిధి, ఎంటర్‌ప్రైజెస్, తదితర అంశాలపై చర్చించారు. కుట్టు కేంద్రాలలో రెండవ దశ స్కూల్ డ్రెస్ వందశాతం కుట్టడం పూర్తి చేయాలన్నారు. మద్దూర్ నారాయణపేటలలో బ్యాంకు లింకేజీలపై అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎన్ని గ్రూపులు ఉన్నాయని ఆరా తీశారు. వచ్చేవారం వరకు ఎలాంటి పెండింగ్ పనులు లేకుండా అన్ని పూర్తి చేయాలన్నారు. అలాగే వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాట్లు ఎంత వరకు వచ్చాయని ప్రశ్నించగా ఈ నెల 28 న జిల్లాలోని మక్తల్, ఊట్కూర్ లో రెండు క్యాంటీన్లను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీపీఎంలు తెలిపారు. నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఆర్డీఏ మొగులప్ప, అంజయ్య పాల్గొన్నారు.

డబుల్ ఓటర్లను గుర్తించాలి

అలాగే డబుల్ ఓటర్లు ఉంటే ఏదైనా ఒకే పోలింగ్ స్టేషన్ లో ఓటరు గా ఉండేలా వారితో క్లియరెన్స్ తీసుకుని జాబితాలో ఉంచాలని, చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని ఆమె తెలిపారు. వీటితో పాటు అభ్యంతరాలు, సలహాలను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఒక పోలింగ్ స్టేషన్ 2 కిలోమీటర్ల పరిధిలోపే ఉండాలని, 1500 ఓటర్లు మించితే అదనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ నగర అధ్యకుడు సలీమ్ తన వార్డులో భివండి కాలనీలో అదనంగా ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. సమీక్షలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీవో మధుమోహన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సుదర్శన్ రెడ్డి, చిన్న రఘు, రాఘవ చౌదరి, బాల్ రాం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



నారాయణపేట: నవంబర్ 3,4 తేదీలలో మక్తల్ పట్టణ కేంద్రంలో సీపీఎం రెండవ జిల్లా మహాసభలు జరగనున్నాయని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండమీది బాల్‌రామ్, మేకల బాలప్ప, గుండెగారి దస్తప్ప పిలుపునిచ్చారు. శనివారం నారాయణపేట మండలంలోని తిరుమలాపూర్‌లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతంగా పోరాడుతున్న సీపీఎం మహాసభలు విజయవంతం చేయాలని కోరారు. నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని సత్వరమే పనులు ప్రారంభించాలని, జిల్లాలో అప్పక్‌పల్లి – కోటకొండ డబుల్ లైన్ రోడ్డును, తిప్రాస్‌పల్లి –మక్తల్ రోడ్డును బాగు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కృష్ణా రైల్వే లైన్ మంజూరు చేయాలన్నారు. ఇల్లు, రేషన్ కార్డు అందివ్వాలని, రైతు రుణమాఫీ చేయాలని కోరారు. భాస్కర్ ,గోపాల్ రాజు, దానప్ప పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలి

నారాయణపేట: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ బృందం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న సమస్యలను పేషెంట్లకు సరేనా వైద్యం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్ మాట్లాడుతూ పేరుకు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఉన్న ఈ ప్రాంత ప్రజలకు సరైన వైద్యం అందడం లేదని ఎమర్జెన్సీ సమస్యలు తలెత్తినప్పుడు మహబూబ్‌నగర్ రెఫర్ చేస్తున్నారన్నారు. డాక్టర్ సిబ్బంది, పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదని, అలాగే మందుల కొరత ఉందన్నారు. పేషెంట్లకు బయటికి వెళ్లి మందులు తెచ్చుకోవాలని చెప్తున్నారన్నారు. గతంలో పనిచేసిన సూపరింటెండెంట్ ఇచ్చిన సమాచారం మేరకు మందులకు, ఆక్సిజన్‌కు రూ.లక్షలలో బిల్లులు చూయించారు కానీ ఆసుపత్రిలో రోగులకు మాత్రం మీ రోగానికి సరైన మందులు లేవని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలని పేదలకు సరైన వైద్యం అందించాలని, కొత్త అంబులెన్స్‌లు మంజూరు చేయాలన్నారు. ఆసుపత్రిలో అన్ని సమస్యలను పరిష్కరించి పేషంట్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నరసింహ,ప్రశాంత్, కెంచ నారాయణ, నరసింహ, అంజి, సాదిక్, బాలకృష్ణ, సాయి, వెంకటేష్, బాలు, రోషన్,దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీగా మద్దూరు

మద్దూరు: మద్దూరును మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ శనివారం రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గతంలో మద్దూరు అనుబంధ గ్రామాలుగా ఉన్న భీంపూర్, నాగంపల్లి, సాపన్ చెరవుతండాతో పాటు రెనివట్ల పంచాయతీని కూడా ఇందులో వీలినం చేసినట్లు తెలుస్తోంది. మద్దూరులో 14 వార్డులు, 7200 ఓటర్లు, రెనివట్లలో 12 వార్డులు 3,800 మంది ఓటర్లు, భీంపూర్‌లో 8 వార్డులు 450 ఓటర్లు, నాగంపల్లిలో 10 వార్డులు 470 ఓటర్లు, సాపన్‌చెరువుతండాల్లో 8 వార్డులు 120 మంది ఓటర్లు ఉన్నారు. రెనివట్ల పంచాయతీ పరిధిలోని ఎర్రగుంటతండా, వాయిలుకుంట తండాలు కూడా మున్సిపాలిటీ పరిధిలోకి రానున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి హామీ మేరకు మద్దూరు మున్సిపాలిటీగా చేసినట్లు సమాచారం.

క్లుప్తంగా

కారు, బైక్ ఢీ : ముగ్గురికి గాయాలు



జడ్చర్ల: మండలంలోని గంగాపూర్ గ్రామం వద్ద 167వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం మోటార్ బైక్, కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. జడ్చర్ల నుంచి గంగాపూర్ వైపు ముందు వెళ్తున్న మోటార్‌బైక్‌ను వెనక నుంచి వేగంగా దూసుకువచ్చిన కారు ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న మహిళ కిందపడిపోగా బైక్ నడుపుతున్న బాలానగర్‌కు చెందిన ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. కారు బైక్‌ను ఢీకొట్టిన తర్వాత రోడ్డు పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టడంతో కారులో చంద్రశేఖర్, మల్లేశం గాయపడ్డారు. కారులో బెలూన్‌లు ఓపెన్ కావడంతో త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారులో ఉన్న వారు రంగారెడ్డి జిల్లా గంగారం గ్రామానికి చెందిన వ్యక్తులుగా గుర్తించారు.

జూరాల కాల్వలో పడి రైతు మృతి

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు జూరాల కాల్వలో పడి రైతు మృతిచెందిన ఘటన గద్వాల మండలం మదనపల్లిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మదనపల్లికి చెందిన సవారన్న (55) జూరాల కుడి కాల్వ సమీపంలోని తన వ్యవసాయ పొలానికి నీరు పారిచేందుకు వెళ్లగా.. మోటారు ద్వారా కాల్వ నీరు రాలేదు. ఈ క్రమంలో జూరాల కాల్వలోకి దిగి మోటారు ఫుట్‌బాల్‌కు అడ్డుగా ఉన్న చెత్తను తొలగించాడు. అనంతరం మోటారును ఆన్ చేయగా.. ఎలాంటి ఫలితం లేకపోవడంతో మరోసారి కాల్వలోకి దిగి పరిశీలించాడు. ఈ క్రమంలో నీటి ఉధృతికి గల్లంతయ్యాడు. గమనించిన తోటి రైతులు అతడిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. విషయాన్ని ప్రాజెక్టు అధికారులకు తెలియజేయడంతో కాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు. గల్లంతైన చోటు నుంచి 200 మీటర్ల దూరంలో ముళ్ల పొదల వద్ద సవారన్న మృతదేహం లభించింది. మృతుడికి భార్య శంకరమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

అనుమానాస్పదంగా చిన్నారి..

అచ్చంపేట రూరల్: ఎనిమిదేళ్ల చిన్నారి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన శనివారం అచ్చంపేటలో చోటు చేసుకుంది. రాత్రి తల్లిదండ్రుల వద్దనే పడుకున్న చిన్నారి... తెల్లారేసరికి విగతజీవిగా కన్పించింది. చిన్నారి మృతిపై అనుమానం ఉందని కన్న తల్లి అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి... ఉప్పునుంతల మండలం జప్తి సదగోడు గ్రామానికి కోటమోని అంజలి, నాగరాజు భార్యభర్తలు. అచ్చంపేట పట్టణంలోని మహేంద్రనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శుక్రవారం రాత్రి ఇద్దరు కూతుళ్లతో పాటు తల్లిదండ్రులు భోజనం చేసి నిద్రపోయారు. ఉదయం లేచి చూడగా చిన్న కూతురు శ్రీవిద్య(8) చలనం లేకుండా అలాగే ఉండిపోయింది. అనుమానం వచ్చి తల్లిదండ్రులు వెంటనే అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు చిన్నారి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. చిన్నారి మృతిపై అనుమానం ఉందని తల్లి అంజలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఇందిర తెలిపారు.

విద్యుదాఘాతంతో ముగ్గురి మృతి

- బల్మూరు మండలంలో అసిస్టెంట్ లైన్‌మన్ దుర్మరణం
- ఫీడర్ ఎల్‌సీ తీసుకోవడంలో ఏమరుపాటుతో దుర్ఘటన

నాగర్‌కర్నూల్ క్రైం/బల్మూర్/మిడ్జిల్: ఉమ్మడి జిల్లాలో శనివారం చోటుచేసుకున్న విద్యుత్ ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని కొండారెడ్డిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వ్యవసాయ బోరుమోటారు విద్యుత్ కనెక్షన్ సరిచేసేందుకు వెళ్లిన అసిస్టెంట్ లైన్‌మన్ మందుల శంకర్ (32) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కొండారెడ్డిపల్లి శివారులో రైతు మారం వెంకటయ్య వ్యవసాయ బోరుమోటారుకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న అసిస్టెంట్ లైన్‌మన్ అక్కడికి చేరుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైరు సరిచేసే క్రమంలో కొండారెడ్డిపల్లి సబ్‌స్టేషన్ నుంచి బల్మూర్ ఫీడర్ లైన్‌కు కాకుండా చెన్నారం ఫీడర్‌కు ఎల్‌సీ తీసుకున్నాడు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి వైర్లను సరిచేస్తుండగా.. షాక్‌కు గురై తీవ్ర గాయాలతో కిందపడ్డాడు. అతడిని వెంటనే రైతులు చికిత్స నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చాంద్‌పాషా తెలిపారు. కాగా, విద్యుత్ షాక్‌తో మృతి చెందిన లైన్‌మన్ శంకర్ స్వగ్రామం కొండనాగుల. అతడికి భార్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నారు.



శంకర్ (ఫైల్)

మిడ్జిల్‌లో ఎలక్ట్రీషియన్..

మిడ్జిల్ మండల కేంద్రంలో ఓ ఎలక్ట్రీషియన్ ప్రమాదవశాత్తు విద్యుఘాతంతో మృతిచెందాడు. ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు వివరాల మేరకు.. జడ్చర్ల మండలం గోప్లాపూర్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ తోకలి చెన్నయ్య (28) మిడ్జిల్‌కు చెందిన ఓ వ్యక్తి ఇంట్లో కరెంటు పిట్టింగ్ చేసేందుకు వచ్చాడు. మీటర్ నుంచి ఇంట్లో బోర్డుకు విద్యుత్ కనెక్షన్ కలుపుతున్న క్రమంలో షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.



చెన్నయ్య (ఫైల్)

దేశీ ఇటిక్యాలలో వివాహిత..

నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలోని దేశీ ఇటిక్యాలకు చెందిన వివాహిత భాగ్యమ్మ (35) విద్యుదాఘాతంతో మృతిచెందింది. ఎస్‌ఐ గోవర్ధన్ వివరాల మేరకు.. శనివారం ఉదయం ఇంటి ఎదుట తెగి పడిన విద్యుత్ వైర్‌ను గమనించకుండా ఊడ్చుకుంటూ వెళ్లిన భాగ్యమ్మ.. వైరును తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, చాలా రోజులుగా ఇంటి ఎదుట ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్‌ను సరిచేయాలని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని.. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే భాగ్యమ్మ మృతి చెందిందని గ్రామస్తులు ఆరోపించారు.



భాగ్యమ్మ (ఫైల్)

ఫైనల్లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని పిల్లలమర్రి రోడ్డులోని క్రికెట్ మైదానంలో ఉమ్మడి జిల్లా అండర్-23 లీగ్ కమ్ నాకౌట్ టోర్నమెంట్ చివరిదశకు చేరింది. ఈ టోర్నీలో పూల్-ఏలో మహబూబ్‌నగర్ జట్టు, పూల్-బీలో నాగర్‌కర్నూల్ జట్టు అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరాయి. శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 60 పరుగుల తేడాతో కొడంగల్ జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ నిర్ణీత 25 ఓవర్లలో వికెట్ కోల్పోయి 174 పరుగులు చేసింది. జట్టులో ఓపెనర్ అబ్దుల్ రాఫే అద్భుతమైన సెంచరీతో రాణించాడు. 70 బంతుల్లో 13 ఫోర్లతో 102 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అక్షయ్ 44 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన కొడంగల్ జట్టు 25 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. జట్టులో అంకిత్ 33, శషాంక్ 24 పరుగులు చేశారు.

గద్వాల జట్టుపై వనపర్తి గెలుపు

మరో మ్యాచ్‌లో వనపర్తి జట్టు 51 పరుగుల తేడాతో గద్వాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన వనపర్తి నిర్ణీత 25 ఓవర్లలో 8 వికెట్లకు 138 పరుగులు చేసింది. జట్టులో ఎ.శ్రీకాంత్ 68 పరుగులు చేశాడు. గద్వాల బౌలర్లు ఇర్ఫాన్ 3, కొండ శ్రీకాంత్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన గద్వాల జట్టు 17 ఓవర్లలో 87 పరుగులకే ఆలౌట్ అయింది. ప్రణీత్‌రెడ్డి 3, ప్రతీష్ 3, ఛత్రపతి 3 వికెట్లు తీశారు. అంతకుముందు క్రీడాజట్లను ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్ పరిచయం చేసుకొని మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని, ఓడిన వారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని కోరారు. ఇలాంటి టోర్నమెంట్‌లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా, అంపైర్లు మాజిద్, అరుణ్ పాల్గొన్నారు.



అబ్దుల్ రాఫే (102 నాటౌట్)

వైభవంగా 'కురుమూర్తి' ఉత్సవాలు



నూతన పాలక మండలి సభ్యులతో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

- అందరి సహకారంతో జాతరను విజయవంతం చేద్దాం
- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పిలుపు
- కొలువుదీరిన నూతన పాలక మండలి

చిన్నచింతకుంట: అందరి సహకారంతో కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు, జాతరను వైభవంగా జరుపుకొందామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం కురుమూర్తిస్వామి ఆలయ నూతన పాలక వర్గం కొలువుదీరింది. చైర్మన్‌గా గోవర్ధన్‌రెడ్డి, సభ్యులుగా భాస్కరచారి, శేఖర్, రాఘవేంద్ర, కమలాకర్, శ్రీధర్‌రెడ్డి, నాగరాజు, రాము, వెంకటేశ్వర్లు, చక్రధర్‌రెడ్డి, గోపాల్, శ్రీకాంత్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, భారతితోపాటు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటయ్య చేత ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కురుమూర్తిస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోవర్ధన్‌రెడ్డిని ఆలయ కార్యాలయంలోని సీటుపై కూర్చోబెట్టి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కురుమూర్తిస్వామి ఆలయానికి ఎంతో గొప్ప పేరు ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆలయం వద్ద ఘాట్ రోడ్డు నిర్మాణం, పరిసరాల్లో మంచినీటి వసతి, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలో పనులు చేపట్టి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. నూతన పాలకవర్గం సమన్వయంతో పనిచేసి ఈ సంవత్సరం స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగేలా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా స్వామివారి దర్శనంలో వీఐపీలకు ప్రాధాన్యం ఇవ్వరాదని సూచించారు. భక్తుల తాకిడి తక్కువగా ఉన్న సమయంలో వారికి అవకాశం కల్పించాలన్నారు. భక్తులకు ఎవరైనా ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు.

■ నూతన చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కురుమూర్తిస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. నాపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. ఎమ్మెల్యే నమ్మకాన్ని వమ్ము చేయనని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు అరవింద్‌కుమార్‌రెడ్డి, మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మదనాపురం మార్కెట్ యార్డు చైర్మన్ ప్రశాంత్, కథలప్ప తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి క్రీడలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఈ రామసుబ్బారెడ్డి

ధరూరు: రేవులపల్లి పీజేపీ క్యాంపులోని జెన్‌కో డీఏవీ పాఠశాల ఆవరణలో విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఆయా క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి శనివారం రాత్రి బహుమతులు అందజేశారు. కల్చరల్ ప్రోగ్రాంలో మొదటి బహుమతిని ఎస్‌ఐబీహెచ్‌ఈఎస్ జట్టు, ద్వితీయ బహుమతిని జూరాల జట్టు, మూడోబహుమతిని కేటీపీఎస్ 5, 6వ స్టేజీ ఉద్యోగులు, బెస్ట్ యాక్టర్, బెస్ట్ రైటర్ ఉస్సేనప్ప(ఎస్‌ఎల్‌బీహెచ్‌ఈఎస్), బెస్ట్ పెర్ఫార్మెన్స్ బాషా(ఎస్‌ఎల్‌బీహెచ్‌ఈఎస్), బెస్ట్ గెటప్స్‌లో వీరమోహన్, కేటీపీఎస్ 5, 6వ స్టేజీ ఉద్యోగులు, బెస్ట్ విలన్ రమేష్, కేటీపీఎస్ 5, 6వ స్టేజీ ఉద్యోగులు, ఫోక్‌సాంగ్స్ విభాగంలో మొదటి బహుమతిని మసూద్, కేటీపీఎస్ 5, 6వ స్టేజీ ఉద్యోగులు, ద్వితీయ బహుమతిని రామన్నచారి, తృతీయ బహుమతిని ఎస్‌కే బాషా (పులిచింతల ప్రాజెక్టు) గెలుచుకోగా.. సీఈ రామసుబ్బారెడ్డి బహుమతులు అందజేశారు. క్రీడాపోటీల్లో విద్యుత్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని ఆయన అన్నారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

76 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 10 క్రస్టు గేట్ల ఎత్తివేత



జూరాల గేట్ల నుంచి విడుదలవుతున్న వరద నీరు

ధరూరు/ దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టుకు 65 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం సాయంత్రానికి 76 వేలకు పెరిగింది. దీంతో 10 క్రస్టు గేట్లను ఎత్తి 41,640 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి నిమిత్తం 36,887, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఎడమ కాల్వకు 1,140, కుడి కాల్వకు 180, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50, సమాంతర కాల్వకు 400, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు వదలగా.. మరో 72 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.398 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో గేట్ల మూసివేత

ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో శనివారం శ్రీశైలం ఆనకట్ట గేట్లు మూసివేశారు. జూరాలలో ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 41,640 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 36,887, సుంకేసుల నుంచి 26,070 మొత్తం 1,04,597 క్యూసెక్కుల వరద శ్రీశైలానికి వస్తుంది. దీంతో శ్రీశైలం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,600 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,952 మొత్తం 67,552 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 26,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,470, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 884.8 అడుగుల వద్ద 214.8450 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సుంకేసులకు 29వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో శనివారం తగ్గుముఖం పట్టింది. 29,380 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 6 గేట్లను తెరిచి స్పిల్‌వే ద్వారా 26,070 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

అటవీ భూమిలో మొక్కలపై లొల్లి



అటవీ భూమిలో మొక్కలు నాటడాన్ని అడ్డుకుంటున్న గిరిజనులు

- తాము 20 ఏళ్లుగా సాగుచేసుకుంటున్నామని గిరిజన కుటుంబాల ఆందోళన
- కొల్లాపూర్ మండలం ఎర్రగట్టు బొల్లారంలో ఉద్రిక్తత

కొల్లాపూర్ రూరల్: కొల్లాపూర్ మండలం నల్లమల అటవీ సమీపంలోని ఎర్రగట్టు బొల్లారంలో ఉన్న అటవీ భూముల్లో వారం రోజులుగా సంబంధిత అధికారులు, సిబ్బంది మొక్కలు నాటుతున్నారు. విషయం తెలుసుకున్న సున్నపుతండా గిరిజనులు హతీరాంనాయక్, లోక్యానాయక్ కుటుంబ సభ్యులు శనివారం అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగారు. తాము 20 ఏళ్లుగా ఆ భూమిని సాగుచేసుకుంటున్నామని పేర్కొంటూ, మొక్కలు నాటడాన్ని అడ్డుకున్నారు. ఇదివరకే నాటిన మొక్కలను తొలగించేందుకు యత్నించగా.. ఫారెస్టు సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఫారెస్టు అధికారులు, గిరిజనుల మధ్య వాగ్వాదం చేటు చేసుకుంది. ఈ క్రమంలో గిరిజన మహిళ చంద్రకళ సమీపంలోని చెట్టుకు ఉరేసుకునేందుకు యత్నించగా.. తండావాసులు అడ్డుకున్నారు. ఫారెస్టు సిబ్బంది పెద్ద మొత్తంలో అక్కడే మోహరించడంతో ఇక చేసేది లేక అక్కడి నుంచి గిరిజనులు వెళ్లిపోయారు. దాదాపు 20 ఎకరాల్లో నాటిన మొక్కలను ఎవరూ తొలగించకుండా ఫారెస్టు సిబ్బంది కాపలా ఉంటున్నారు. ఈ విషయంపై ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. ఎర్రగట్టు బొల్లారంలో 20 ఏళ్ల క్రితం నీలగిరి చెట్లను పెంచినట్లు తెలిపారు. ఆ చెట్లను రెండు నెలల క్రితం సున్నపుతండాకు చెందిన గిరిజనులు, మొలచింతపల్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబం తొలగించి, భూమిని చదును చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై తమకు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి భూమిని చదును చేయడాన్ని అడ్డుకున్నామన్నారు. మళ్లీ మొక్కలు నాటుతుండగా.. అడ్డుకున్నారని, వారికి ఎలాంటి హక్కు పత్రాలు లేవన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

పట్టపగలే చైన్‌స్నాచింగ్

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో పట్టపగలే చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తిరుపతమ్మ రెండేళ్లుగా పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో జ్యూస్ వ్యాపారం చేస్తూ ఇక్కడే నివాసముంటుంది. శనివారం ఉదయం ఇంట్లో పనులు ముగించుకొని ఇంటి ఎదుట కూర్చోగా.. ఇద్దరు వ్యక్తులు వచ్చారు. తాము విద్యుత్ శాఖ నుంచి వచ్చాం.. వివరాలు తెలపాలంటూ మహిళను మాటల్లోకి దింపారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఆమెపై దాడిచేసి, మెడలో ఉన్న మూడు తులాల పుస్తెలతాడును లాక్కొని పారిపోయారు. ఈ తతంగం మొత్తం సమీపంలోని ఇళ్ల వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. ఘటనా స్థలానికి సీఐ నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డి, పోలీసు సిబ్బంది చేరుకొని వివరాలు సేకరించారు. దుండగుల కోసం గాలింపు చేపట్టారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన ఫుటేజీ ఆధారంగా ఇద్దరు దొంగల ముఖచిత్రాలను పోలీసులు సామాజిక మాధ్యమాలలో పోస్టు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కర్నిలో వరుస చోరీలు

మక్తల్: మండలంలోని కర్ని గ్రామంలో గుర్తుతెలియని దుండగులు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. గ్రామానికి చెందిన గుంటప్పగౌడ్ ఇంట్లో శుక్రవారం చోరీకి పాల్పడగా.. శనివారం ఉప్పరి చంద్రకళ ఇంట్లో పట్టపగలే చోరీ చేశారు. చంద్రకళ కూలీ పనులు, పిల్లలు స్కూల్‌కు వెళ్లగా.. ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ. 2 లక్షలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ బాగ్యలక్ష్మీ రెడ్డి అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శుద్ధజలంతోనే.. ద్రావణం తయారీ



పొలంలో మందు పిచికారీ చేస్తున్న రైతు

అలంపూర్: పంటసాగు చేసే అన్నదాతలు సస్యరక్షణ కోసం పలు రకాల రసాయనికి మందులు వాడుతారు. మందులను నీటిలో కలిపి ఆ ద్రావణాన్ని మొక్కలకు పిచికారీ చేస్తారు. మందును నీటిలో కలిపినప్పుడు సహజంగా కొన్ని మార్పులు వస్తాయి. పురుగు మందు ద్రావణ తయారీలో నాణ్యత లోపించిన నీరు వాడితే ప్రతికూల మార్పులు జరిగి మందు ప్రభావం తగ్గుతుందని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ రైతులకు సూచించారు. నాణ్యత లేని నీటిని వినియోగిస్తే రైతులు నష్టపోతారని పేర్కొన్నారు. మందు ద్రావణం చేయడానికి నాణ్యత గల నీరు వాడినప్పుడే మందు శక్తి వంతంగా పని చేసి ఫలితం పొందవచ్చని సూచించారు.

ఏలాంటి నీరు కావాలి? ఏ లక్షణాలు ఉండాలి?

మందు ద్రావణం తయారీకి ముఖ్యంగా మూడు లక్షణాలు అనుకూలంగా ఉండాలి. వీటిపై సరైన అవగాహన పెంచుకోవాలి.

1. పీహెచ్ ఉదజని సూచిక లేక రసాయన స్థితి :

నీటిలో కరిగి ఉండే లవణాల స్వభావంపై ఆధారపడి ఉంటుంది. ఇది ఆమ్లం, తటస్థం, క్షారముగా ఉండవచ్చు. అయితే ఆమ్లగుణ తీవ్రత అధికంగా లేదా క్షార గుణ తీవ్రత అధికంగా ఉన్న నీటిని మందు ద్రావణం తయారు చేయడానికి ఉపయోగించరాదు. దీనివల్ల రసాయన ప్రతికూల మార్పులు ఏర్పడతాయి.

2. సెలినిటి లేక సాల్ట్ కంటెంట్ (లవణ పరిమాణ సూచిక)

అన్ని రకాల నీటిలోను కొన్ని లవణాలు కరిగి ఉంటాయి. కొన్నింటిలో ఎక్కువగానూ కొన్నింటిలో తక్కువగాను ఉండవచ్చు. లవణాలు ఎంత తక్కువగా ఉంటే అంత మంచి నీరుగా భావించాలి. లవణాలు అధికంగా ఉన్న నీరు మందు ద్రావణంలో కలపడానికి పనికిరావు.

3. నీటి కాఠిన్యత :

నీటిలో ఉండే లవణాల స్వభావాన్ని బట్టి పరస్పర ఆధిక్యతను బట్టి నీటిని రెండు కాలుగా విభజించవచ్చు.

సాఫ్ట్ వాటర్(మదు జలం): సబ్బుతో సులభంగా నురగ వస్తోంది. దీనితో ఏ సమస్య ఉండదు. మందు ద్రావణ తయారీకి నిరభ్యంతరంగా వాడుకోవచ్చు.

హార్డ్ వాటర్ (కఠిన జలం): ఇందులో బైకార్బోనేట్స్, క్లోరైడ్స్, సల్ఫేట్స్‌కు సంబంధించిన కాల్షియం, మెగ్నీషియం, లవణాలు అధికంగా ఉంటాయి. ఈ నీటిలో సబ్బు వినియోగించినప్పుడు నురగ రాదు. నీరు విరిగిపోయినట్లు కనిస్తుంది. నురగ బాగా రావడానికి అధిక పరిమాణంలో సబ్బు వాడాల్సి వస్తోంది. ఈ నీటిని మందు ద్రావణ తయారీకి వాడినప్పుడు కూడా ఇదే పరిస్థితి ఎదురవుతుంది. రసాయన ప్రతికూల చర్య జరగడం వల్ల ద్రావణం విరిగిపోవడం గమనించవచ్చు. దీని వల్ల మందు క్రిమి సంహారక గుణం క్షీణిస్తుంది.

పశువుల కాపరిపై ఎలుగుబంట్ల దాడి



గాయపడిన అంజయ్యకు ప్రథమ చికిత్స అందిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

అమ్రాబాద్: పశువులను మేపేందుకు వెళ్తున్న వ్యక్తిపై మూడు ఎలుగుబంట్లు దాడికి పాల్పడటంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం ఉడిమిళ్ల అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. నల్లగొండ జిల్లా నేరడికొమ్ము మండలం కాస్‌రాజ్‌పల్లికి చెందిన బద్దెల అంజయ్య మరో ముగ్గురితో కలిసి పదర మండలం ఉడిమిళ్ల అటవీ ప్రాంతంలో నాలుగు నెలలుగా తన పశువులను మందగా ఏర్పాటు చేసుకొని మేపుతున్నాడు. శనివారం సరుకుల కోసం ఉడిమిళ్లకు వచ్చి, తిరిగి పశువుల మంద వద్దకు వెళ్తుండగా.. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పొదలమాటు నుంచి మూడు ఎలుగుబంట్లు ఒక్కసారిగా అంజయ్యపై దాడి చేశాయి. ఈ దాడిలో అంజయ్య ఎడమ కన్ను పూర్తిగా పోవడంతో పాటు తల, శరీర భాగాలకు తీవ్రగాయాలయ్యాయి. వాటి నుంచి తప్పించుకొని గ్రామంవైపు రావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది మల్లేష్ అక్కడే అతడికి ప్రథమ చికిత్సలు అందించి, అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు.



జోహర్ కప్‌లో యువ భారత్‌కు కాంస్య పతకం

సుల్తాన్ జొహార్ కప్ అండర్–21 అంతర్జాతీయ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు కాంస్య పతకం కైవసం చేసుకుంది. మలేసియా వేదికగా శనివారం జరిగిన కాంస్య పతక పోరులో భారత జట్టు షూటౌట్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి కాంస్యం ఖాతాలో వేసుకుంది. గోల్‌కీపర్ బిక్రమ్‌జిత్ సింగ్ ప్రత్యర్థి మూడు గోల్స్ ప్రయత్నాలను అడ్డుకోవడంతో భారత జట్టు విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు రెండేసి గోల్స్ చేయగా... ఫలితం తేల్చేందుకు నిర్వహించిన షూటౌట్‌లో భారత్ 3–2తో గెలుపొందింది. షూటౌట్‌లో భారత్ తరఫున గుర్‌జోత్ సింగ్, మన్‌మీత్ సింగ్, సౌరభ్ ఆనంద్ గోల్ కొట్టారు. అంతకుముందు భారత్ తరఫున దిల్‌రాజ్ సింగ్ (11వ నిమిషంలో), మన్‌మీత్ సింగ్ (20వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... న్యూజిలాండ్ తరఫున బ్రౌన్ (51వ ని.లో), జాంటీ ఎల్మ్స్ (57వ ని.లో) చెరో గోల్ చేశారు. ఆరంభం నుంచి మ్యాచ్‌పై పట్టు కొనసాగించిన భారత జట్టు... చివరి క్వార్టర్‌లో ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇచ్చింది.

‘కివీ’ చేతుల్లో ఖేల్ ఖతం!

అనూహ్యం, అసాధారణమేమీ జరగలేదు... న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో భారత బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌లోనూ తమ వైఫల్యాన్ని కొనసాగించారు...భారీ లక్ష్యాన్ని ఛేదించలేక కుప్పకూలి సిరీస్‌ను అప్పగించేశారు... సొంతగడ్డపై కూడా స్పిన్‌ను ఆడలేని తమ బలహీనతను మళ్లీ ప్రదర్శిస్తూ టీమిండియా తలవంచింది...ఫలితంగా పుష్కర కాలం తర్వాత స్వదేశంలో టెస్టు సిరీస్ చేజారింది... ఒక్క యశస్వి జైస్వాల్ మాత్రమే ధాటిగా ఆడి ఆశలు రేపినా... మిగతావారంతా చేతులెత్తేయడంతో మూడో రోజుకే మ్యాచ్ ముగిసింది... కివీ బౌలర్ సాంట్నర్ మరోసారి తన మాయాజాలం ప్రదర్శిస్తూ ఆరు వికెట్లతో చెలరేగాడు. శ్రీలంక చేతిలో చిత్తుగా ఓడి ఏమాత్రం అంచనాలు, ఆశలు లేకుండా భారత గడ్డపై అడుగుపెట్టిన న్యూజిలాండ్ బృందం అసాధారణ ప్రదర్శనతో ఏకంగా 2–0తో సిరీస్‌నే గెలుచుకోవడం విశేషం. ఇక భారత్ ముందు మిగిలింది చివరి మ్యాచ్‌లో నెగ్గి కాస్త పరువు కాపాడుకోవడమే!



విజయానందంలో న్యూజిలాండ్ ఆటగాళ్లు



సాంట్నర్

రెండో టెస్టులో భారత్ ఓటమి

- 113 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం
- 2–0తో సిరీస్ సొంతం
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 245 ఆలౌట్
- శుక్రవారం నుంచి చివరి టెస్టు

పుణే: స్వదేశంలో భారత జట్టు అనూహ్య రీతిలో టెస్టు సిరీస్‌ను కోల్పోయింది. శనివారం ముగిసిన రెండో టెస్టులో న్యూజిలాండ్ 113 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. తొలి మ్యాచ్‌లోనూ నెగ్గిన ఆ జట్టు మరో టెస్టు మిగిలి ఉండగానే సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. 359 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 60.2 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ (65 బంతుల్లో 77; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అర్ధసెంచరీ చేయగా, రవీంద్ర జడేజా (84 బంతుల్లో 42; 2 ఫోర్లు) చివర్లో కాస్త పోరాడాడు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ మిచెల్ సాంట్నర్ (6/104) మరోసారి భారత్‌ను దెబ్బ కొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 198/5తో ఆట కొనసాగించిన న్యూజిలాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 69.4 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. ఫిలిప్స్ (48 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), బ్లన్‌డెల్ (41; 3 ఫోర్లు) కీలక పరుగులు సాధించారు. భారత బౌలర్లలో సుందర్ 4, జడేజా 3 వికెట్లు తీశారు. ఇరు జట్ల మధ్య మూడో టెస్టు నవంబర్ 1 నుంచి ముంబైలో జరుగుతుంది.

జైస్వాల్ మినహా...

క్రీజ్‌లో జైస్వాల్ ఉన్నంత సేపు భారత జట్టు లక్ష్యంపై గురి పెట్టి దూకుడైన ఆటను ప్రదర్శించేందుకు సిద్ధమైందని అనిపించింది. ఒక వైపు రోహిత్ (8) మళ్లీ విఫలమైనా...మరో ఎండ్‌లో జైస్వాల్ తొలి ఓవర్‌నుంచే బౌండరీలతో చెలరేగాడు. అతనికి శుబ్‌మన్ గిల్ (23) కూడా కొద్ది సేపు సహకరించాడు. లంచ్ సమయానికి భారత్ 81/1తో మెరుగైన స్థితిలో కనిపించగా... విరామం తర్వాత 41 బంతుల్లోనే జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తయింది. అయితే రెండో సెషన్‌లో గిల్‌ను అవుట్ చేసి పతనానికి శ్రీకారం చుట్టిన సాంట్నర్ ఆ తర్వాత జైస్వాల్ వికెట్‌నూ ఖాతాలో వేసుకున్నాడు. మరో ఐదు బంతులకే పంత్ (0) అనవసరపు సింగిల్‌కు ప్రయత్నించి రనౌట్ కావడం జట్టును మరింత దెబ్బ తీసింది. కోహ్లి పాయింట్ దిశగా ఆడి పరుగు ప్రారంభించగా... పంత్ మరో ఆలోచన లేకుండా దూసుకొచ్చాడు. అయితే అతను డైవ్ చేసినా లాభం లేకపోయింది. కోహ్లి (17)ని సాంట్నర్ ఎల్బీగా దొరకబుచ్చుకోగా, భారత బ్యాటర్ రివ్యూ చేసినా ఫలితం దక్కలేదు. అనంతరం రెండు పరుగుల వ్యవధిలో సర్ఫరాజ్ (9), సుందర్ (21) అవుటయ్యారు. జడేజా, అశ్విన్ (18) కొద్ది సేపు ప్రతిఘటించినా... అదీ ఎక్కువ సేపు సాగలేదు. అంతకు ముందు న్యూజిలాండ్ మూడో రోజు మరో 16.4 ఓవర్లు ఆడి మరో 57 పరుగులు జోడించగలిగింది.

స్కోరు వివరాలు:

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 259; భారత్ తొలి ఇన్నింగ్స్ 156; న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) (బి) సుందర్ 86; కాన్వే (ఎల్బీ) (బి) సుందర్ 17; యంగ్ (ఎల్బీ) (బి) అశ్విన్ 23; రచిన్ (బి) సుందర్ 9; మిచెల్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 18; బ్లన్‌డెల్ (బి) జడేజా 41; ఫిలిప్స్ (నాటౌట్) 48; సాంట్నర్ (సి) బుమ్రా (బి) జడేజా 4; సౌతీ (సి) రోహిత్ (బి) అశ్విన్ 0; ఎజాజ్ (సి) సుందర్ (బి) జడేజా 1; రూర్కే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (69.4 ఓవర్లలో ఆలౌట్) 255.**

వికెట్ల పతనం: 1–36, 2–78, 3–89, 4–123, 5–183, 6–231, 7–237, 8–238, 9–241, 10–255. **బౌలింగ్:** అశ్విన్ 25–2–97–2, సుందర్ 19–0–56–4, జడేజా 19.4–3–72–3, బుమ్రా 6–1–25–0. **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 77; రోహిత్ (సి) యంగ్ (బి) సాంట్నర్ 8; గిల్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 23; కోహ్లి (ఎల్బీ) (బి) సాంట్నర్ 17; పంత్ (రనౌట్) 0; సుందర్ (సి) యంగ్ (బి) ఫిలిప్స్ 21; సర్ఫరాజ్ (బి) సాంట్నర్ 9; జడేజా (సి) సౌతీ (బి) పటేల్ 42; అశ్విన్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 18; ఆకాశ్‌దీప్ (సి) రచిన్ (బి) ఎజాజ్ 1; బుమ్రా (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (60.2 ఓవర్లలో ఆలౌట్) 245. వికెట్ల పతనం:** 1–34, 2–96, 3–127, 4–127, 5–147, 6–165, 7–167, 8–206, 9–229, 10–245. **బౌలింగ్:** సౌతీ 2–0–15–0, రూర్కే 1–0–5–0, సాంట్నర్ 29–2–104–6, ఎజాజ్ 12.2–0–43–2, ఫిలిప్స్ 16–0–60–1.

12 భారత జట్టు స్వదేశంలో 12 ఏళ్ల తర్వాత టెస్టు సిరీస్ కోల్పోయింది. 2012లో ఇంగ్లండ్ చేతిలో టీమిండియా 1–2తో ఓడింది.

18 తాజా ఓటమికి ముందు స్వదేశంలో భారత్ వరుసగా గెలిచిన సిరీస్‌ల సంఖ్య.

1 భారత గడ్డపై న్యూజిలాండ్‌కు ఇదే తొలి టెస్టు సిరీస్ విజయం. గతంలో కివీస్ ఇక్కడ 12 సిరీస్‌లు ఆడగా...10 ఓడి 2 డ్రా చేసుకుంది.

‘పరాభవ భారం’

‘నాపై ఇక కత్తులు దూయండి’... బెంగళూరు టెస్టులో 46కు ఆలౌట్ అయిన తర్వాత మీడియా సమావేశంలో రోహిత్ శర్మ వ్యాఖ్య ఇది!

‘12 ఏళ్ల తర్వాత ఒక సిరీస్ ఓడిపోయాం ...ఈమాత్రం మినహాయింపు ఇవ్వడంలో తప్పు లేదు’...రెండో టెస్టులో ఓటమి అనంతరం అదే కెప్టెన్ చెప్పిన మాట ఇది.



ఇన్నేళ్లుగా తమ ఆటతో విజయాలనే తాము అలవాటు చేశామని, కాబట్టి పరాజయం అందరికీ కొత్తగా అనిపిస్తోందని కూడా రోహిత్ అన్నాడు. అంటే 46 ఆలౌట్‌ను ఒకానొక అరుదైన రోజుగా అంగీకరించిన కెప్టెన్‌కు ఇప్పుడు ఓటమి అలవాటైపోయినట్లుగా అనిపించింది! అయితే ఈ పుష్కర కాలంలో అప్పుడప్పుడు వచ్చిన మ్యాచ్ పరాజయాలకు, తాజాగా సిరీస్ కోల్పోవడానికి మధ్య చాలా తేడా ఉంది. ఇన్నేళ్లలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలాంటి టీమ్‌లు భారత్‌ను ఓడించేందుకు తీవ్రంగా ప్రయత్నించాయి. మ్యాచ్‌లు గెలిచినా అవి సిరీస్‌ను మాత్రం సొంతం చేసుకోలేకపోయాయి. వీటితో పోలిస్తే న్యూజిలాండ్ టెస్టుల్లో అనామక జట్టు కిందే లెక్క. దీనికి ముందు 12 సిరీస్‌లలో కలిపి ఆ టీమ్ ఇక్కడ రెండే మ్యాచ్‌లు గెలవగలిగింది. పైగా ఇటీవలే శ్రీలంక చేతిలో 0–2తో చిత్తుగా ఓడి ఇక్కడకు వచ్చింది. సౌతీ, లాథమ్‌లకు మినహా మిగతావారెవరికీ ఇక్కడ టెస్టులు ఆడిన అనుభవం ఎక్కువగా లేదు. కేన్ విలియమ్సన్‌లాంటి స్టార్ ప్లేయర్ కూడా అందుబాటులో లేడు. అయినా సరే కివీస్ టీమ్ భారత్‌పై పైచేయి సాధించగలిగింది. రెండు పూర్తిగా భిన్నమైన పిచ్‌లపై ఆ జట్టు పైచేయి సాధించిన తీరు టీమిండియా లోపాలను చూపించింది. ముందుగా బెంగళూరు టెస్టులో పేస్ బౌలింగ్ ముందు భారత్ మోకరిల్లి చెత్త రికార్డులను నమోదు చేసింది. దాంతో హడావిడిగా మన బలం స్పిన్ అంటూ పూర్తిగా స్పిన్ పిచ్‌తో సిద్ధమైంది. కానీ ముందు మన బ్యాటర్లు అలాంటి పిచ్‌పై, స్పిన్‌ను సమర్థంగా ఆడగలరా లేదా అనే ఆలోచన రానట్లుంది! అందుకే సాంట్నర్ స్పిన్‌ను కూడా ఎదుర్కోలేకపోయింది. 2017లో ఇదే పుణేలో, ఇదే తరహా పిచ్‌పై ఇలాంటి లెఫ్టార్మ్ స్పిన్నర్ స్టీవ్ ఓ కీఫ్‌కు 12 వికెట్లు అప్పగించి ఆసీస్ చేతిలో భారత్ 333 పరుగులతో చిత్తయింది. ఇప్పుడు కూడా పదునైన స్పిన్‌ను ఆడటం తమ వల్ల కాదని మన బ్యాటర్లు నిరూపించారు. పిచ్‌పై గిర్రున తిరుగుతున్న బంతులకు వారి వద్ద జవాబు లేకపోయింది. బంగ్లాలాంటి బలహీన జట్టుపై దూకుడైన ఆటతో సిరీస్ గెలిచిన వైనంతో మన ప్లేయర్లలో అతి విశ్వాసం పెరిగినట్లు కనిపించింది. పైగా న్యూజిలాండ్ టెస్టుల్లో ప్రభావం చూపలేదనే తేలికపాటి భావం కూడా కావచ్చు! సిరీస్‌లో రోహిత్ విఫలం కాగా, కోహ్లి తన ఆటతో తీవ్రంగా నిరాశపర్చాడు. జైస్వాల్ ఒక్కడే ఆకట్టుకోగా, రెండో ఇన్నింగ్స్‌లో పంత్ రనౌట్ అతని నిర్లక్ష్యాన్ని చూపించింది. సాంట్నర్ చెలరేగిన చోట అదే శైలి బౌలర్ అయిన జడేజాకు తొలి ఇన్నింగ్స్‌లో ఒక్క వికెట్ కూడా దక్కలేదు. ఇదే టీమ్ ఆస్ట్రేలియాకు వెళ్లి గెలుస్తుందనుకోవడం అత్యాశే. మరో వైపు కోచ్ గౌతమ్ గంభీర్‌కు కూడా ఈ ఓటమిలో పాత్ర ఉంది. బంగ్లాపై సిరీస్ విజయాన్ని గొప్పగా చెప్పుకుంటూ...‘ఒక్క రోజులో 400 పరుగులు చేయగల, అవసరమైతే రెండు రోజులు నిలబడి డ్రా చేసుకోగల జట్టుగా మేం మారాలి. నా దృష్టిలో ఆటలో ఎదగడం అంటే అదే’ అంటూ వ్యాఖ్య చేశాడు. 400 సంగతేమో కానీ మన బ్యాటింగ్ బలహీనత ఏమిటో ఇది చూపించింది. శ్రీలంక చేతిలో 27 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్ ఓటమి, 46 ఆలౌట్, 36 ఏళ్ల తర్వాత కివీస్ చేతిలో టెస్టు పరాజయం, ఇప్పుడు తొలిసారి సిరీస్, 12 ఏళ్ల తర్వాత స్వదేశంలో పరాభవం...ఇవన్నీ కూడా కోచ్ గంభీర్ ఖాతాలో చేరాల్సినవే! ఇకపై మాటలను కట్టిపెట్టి కోచ్‌గా తన బాధ్యతలు సరిగ్గా నెరవేర్చాల్సిన సమయమిది.

–సాక్షి క్రీడావిభాగం

4 రోహిత్ కెప్టెన్సీలో స్వదేశంలో భారత్ ఓడిన టెస్టుల సంఖ్య. గతంలో అజహర్, కపిల్ కెప్టెన్సీలో 4 మ్యాచ్‌లు ఓడగా... పటౌడీ నాయకత్వంలో భారత్ 9 మ్యాచ్‌లు ఓడింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

యాభైఏళ్ల రాజీనామా



చిరంజీవి

కొణిదెల శివ శంకర వరప్రసాద్.... ఈ పేరు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. హీరో చిరంజీవి అసలు పేరు ఇదే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కాగా శివ శంకర వరప్రసాద్‌గా రంగస్థలంపై ‘రాజీనామా’ అనే నాటకంతో మొదలైన ఆయన నట ప్రస్థానం యాభై ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిరంజీవి ఓ ఫొటోను తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి, ‘‘1974లో నర్సాపూర్‌లోని వైఎన్‌ఎమ్ కళాశాలలో బీకామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నప్పుడు రంగస్థలం మీద నేను వేసిన తొలి నాటకం ‘రాజీనామా’. కోన గోవిందరావుగారు రచించారు. నాకు నటుడిగా తొలి గుర్తింపు ఇచ్చింది ‘రాజీనామా’. అది కూడా బెస్ట్ యాక్టర్‌గా అవార్డు రావడం ఎనలేని ప్రోత్సాహం ఇచ్చింది. 1974–2024... యాభై సంవత్సరాల నట ప్రస్థానం ఎనలేని ఆనందాన్ని ఇచ్చింది’’ అంటూ రాసుకొచ్చారు చిరంజీవి. ఇదిలా ఉంటే.. చిరంజీవి నటించిన తొలి చిత్రం ‘పునాది రాళ్ళు’. ఈ సినిమాకి గూడపాటి రాజ్‌కుమార్ దర్శకత్వం వహించారు. అయితే ఈ చిత్రం విడుదల ఆలస్యం కావడంతో చిరంజీవి నటించిన ‘ప్రాణం ఖరీదు’ సినిమా మొదట రిలీజ్ అయింది. ‘ప్రాణం ఖరీదు’ చిత్రం 1978 సెప్టెంబరు 22న విడుదల కాగా ‘పునాది రాళ్ళు’ 1979 జూన్ 21న రిలీజ్ అయింది. కాగా ప్రస్తుతం చిరంజీవి నటిస్తున్న చిత్రం ‘విశ్వంభర’. వశిష్ఠ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని వంశీ, ప్రమోద్, విక్కీ నిర్మిస్తున్నారు.



రాజ్‌కుమార్ పెరియసామి, శివ కార్తికేయన్, సాయి పల్లవి, సుధాకర్ రెడ్డి, నాగ్ అశ్విన్

ఇలాంటి కథలు ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతాయి

- దర్శకుడు నాగ్ అశ్విన్

‘‘అమరన్’ అద్భుతమైన కథ. రియల్ స్టోరీ తీసినప్పుడు చాలా బాధ్యత ఉంటుంది. ఇలాంటి కథలు ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. కమల్‌హాసన్‌గారు ఈ సినిమాని నిర్మించడం గొప్ప విషయం. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి’’ అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. శివ కార్తికేయన్, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం ‘అమరన్’. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి రిలీజ్ చేస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా దర్శకుడు నాగ్ అశ్విన్ పాల్గొన్నారు. ఈ వేదికపై శివ కార్తికేయన్ మాట్లాడుతూ – ‘‘మేజర్ ముకుంద్ వరదరాజన్, ఇందు రెబెకా బయోపిక్‌గా రూపొందిన చిత్రం ‘అమరన్’. ఉద్యోగాన్ని ప్రేమించే కుటుంబం ఎలా ఉంటుందో డైరెక్టర్ రాజకుమార్ అద్భుతంగా చూపించారు. ఈ సినిమాలో నేను మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్ర చేశాను. ‘అమరన్’ లాంటి చిత్రాన్ని సపోర్ట్ చేస్తే ఇలాంటి రియల్ హీరో స్టోరీస్ ఇంకెన్నో వస్తాయి’’ అన్నారు. ‘‘అమరన్’ సినిమాతో మీ ముందుకు రావడం గర్వంగా ఉంది’’ అని సాయి పల్లవి తెలిపారు. ‘‘దేశవ్యాప్తంగా సెలబ్రేట్ చేసుకునే సినిమా ఇది. కమల్‌హాసన్ గారి వల్లే ఈ ప్రాజెక్టు సాధ్యమైంది. ఈ సినిమాని ఇంత పెద్ద స్థాయిలో తెలుగులో రిలీజ్ చేస్తున్న సుధాకర్ రెడ్డి సార్‌కి కృతజ్ఞతలు’’ అన్నారు రాజ్‌కుమార్ పెరియసామి. ఈ వేడుకలో నిర్మాత ‘ఠాగూర్’ మధు, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

Gold Memories

మనిషి జీవితానికి ప్రతిబింబం సినిమా. ఎన్నో అద్భుతమైన చిత్రాలు మన మదిలో జ్ఞాపకాలుగా ఉన్నాయి. అవి బంగారు జ్ఞాపకాలు. అందుకే ‘సాక్షి యూట్యూబ్’ ఇక ప్రతివారం ఓ సినిమాతో మీ మనస్సును తట్టే ప్రయత్నం చేస్తుంది ‘గోల్డెన్ మెమొరీస్’ రూపంలో. ఈ వారం ‘గోల్డెన్ మెమొరీస్’లో ఓ ఆణిముత్యం అయిన ‘పెళ్ళిపుస్తకం’ గురించి తెలుసుకోవాలంటే ఈ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేస్తే చాలు.

ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు

- కిరణ్ అబ్బవరం



నయన్ సారిక, కిరణ్ అబ్బవరం, తన్వీ రామ్

‘క’ కథ విన్నప్పుడు ఇలాంటి మంచి సినిమాను ప్రేక్షకులకు చూపించాలనిపించింది. ఈ సినిమా క్లైమాక్స్ చూసి ఆడియన్స్ ఆశ్చర్యపోతారు. ‘క’ సినిమాలోని ఏదైనా ఎలిమెంట్‌ను గతంలో స్క్రీన్‌పై చూశామని మీకు (ఆడియన్స్) అనిపిస్తే నేను సినిమాలు చేయడం మానేస్తా’’ అని కిరణ్ అబ్బవరం అన్నారు. సుజీత్–సందీప్ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం హీరోగా, నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన పీరియాడికల్ మూవీ ‘క’. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించారు. ఈ నెల 31న ఈ సినిమాను తెలుగులో వంశీ నందిపాటి రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ – ‘క’లో పోస్ట్‌మ్యాన్ వాసుదేవ్‌గా కనిపిస్తాను. తోటి వారి జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని వాళ్ల ఉత్తరాలు చదువుతుంటాడు వాసుదేవ్. ఈ క్రమంలో అతని జీవితం ఎలా టర్న్ తీసుకుంది? అన్నది కథాంశం. వాసుదేవ్ పాత్రలో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. మా సినిమాను కన్నడ, మలయాళ, తమిళ భాషల్లో రిలీజ్ చేయాలనుకున్నాం... థియేటర్స్ దొరకలేదు. ప్రస్తుతం తెలుగులో రిలీజ్ చేస్తున్నాం. వారం తర్వాత మిగతా భాషల్లో రిలీజ్ చేసే ప్రయత్నం చేస్తాం’’ అన్నారు. ‘‘సినిమా ఆరంభం కాగానే ఆడియన్స్ ‘క’ ప్రపంచంలోకి వెళ్తారు’’ అన్నారు సందీప్. ‘‘‘క’కు ప్రేక్షకాదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది’’ అని చెప్పారు వంశీ నందిపాటి.



రీతూ వర్మ మజాకా

హీరో సందీప్ కిషన్‌తో కలిసి మజాకా చేస్తున్నారు హీరోయిన్ రీతూ వర్మ. సందీప్ కిషన్, రీతూ వర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం ‘మజాకా’. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ పతాకాలపై రాజేష్ దండా నిర్మిస్తున్న చిత్రం ఇది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ వైజాగ్‌లో జరుగుతోంది. కాగా ‘మజాకా’ సినిమాలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తున్నట్లుగా వెల్లడించి, వైజాగ్ సెట్స్‌లో రీతూ వర్మ జాయిన్ అయినట్లుగా చిత్రయూనిట్ శనివారం అధికారికంగా వెల్లడించింది. ప్రస్తుతం పెళ్లి బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోందని తెలుస్తోంది. వచ్చే సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

అందమైన ప్రేమకథ



విహాన్షి, షెరాజ్, నేహా దేశ్ పాండే, భాష్య శ్రీ

షెరాజ్ మెహదీ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘ఓ అందాల రాక్షసి’. హీరోయిన్లు విహాన్షి హెగ్డే, కృతీ వర్మ, నేహా దేశ్ పాండే నటించారు. సుమన్, తమ్మారెడ్డి భరద్వాజ కీలక పాత్రలు పోషించారు. షేర్ సమర్పణలో స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్‌పై సురేందర్ కౌర్ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డైరెక్టర్, హీరో, మ్యూజిక్ డైరెక్టర్ షెరాజ్ మెహదీ మాట్లాడుతూ– ‘‘ఓ అందాల రాక్షసి’ గ్లామర్ బేస్డ్ మూవీ కాదు. మంచి కంటెంట్ ఉన్న అందమైన ప్రేమకథ. అమాయక మహిళలు కొందరి చేతిలో ఎలా మోసపోతున్నారు?. మోసం చేసేవారికి ఎలాంటి శిక్ష ఉంటుంది? అని ఈ మూవీలో చూపిస్తున్నాం’’ అని తెలిపారు. ‘‘ఓ అందాల రాక్షసి’ సినిమాకు కథ, మాటలు, పాటలు రాశాను’’ అని భాష్య శ్రీ చెప్పారు.

కేజీఎఫ్‌కు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది

- దర్శకుడు సూరి



శ్రీ మురళి హీరోగా డా. సూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘బఘీర’. ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. హోంబలే ఫిలింస్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31 విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రదర్శకుడు డా. సూరి మాట్లాడుతూ– ‘‘ప్రశాంత్ నీల్‌గారి ‘కేజీఎఫ్, సలార్’ చిత్రాల రైటింగ్ విభాగంలో నేనూ ఉన్నాను. శ్రీ మురళిగారితో నేను ఒక సినిమా చేద్దామనుకున్నప్పుడు కథ కుదర్లేదు. అప్పుడు తన దగ్గర కథ ఉందని ప్రశాంత్ నీల్‌గారు చెప్పడంతో ‘బఘీర’ చిత్రం ప్రారంభమైంది. సూపర్ హీరో అవ్వాలనుకున్న ఓ కుర్రాడి కథే ఈ చిత్రం. ఈ సినిమా అవుట్‌పుట్ చూసి ప్రశాంత్ నీల్‌గారు హ్యాపీ ఫీలయ్యారు. శ్రీ మురళి బాగా నటించారు. ‘బఘీర’ను ‘కేజీఎఫ్’తో పోల్చి మాట్లాడుతున్నారు. ‘బఘీర’ సినిమా ‘కేజీఎఫ్’ టోన్‌లో ఉండదు. ‘కేజీఎఫ్’ చరిత్రలాంటి సినిమా. ఈ సినిమాకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది’’ అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ‘‘పన్నెండేళ్ల క్రితం యశ్‌తో ఓ సినిమా చేశాను (‘లక్కీ’). ఆ తర్వాత యశ్‌తో ట్రావెల్ అయ్యాను. యశ్ కథలను నేనే వినేవాడిని. అయితే యశ్‌తో నేను అనుకున్న సినిమా వర్కౌట్ కాలేదు. ఆ తర్వాత ‘కేజీఎఫ్’ వల్ల యశ్‌కు చాలా సమయం పట్టింది. దీంతో నేను శ్రీ మురళితో ‘బఘీర’ చేశాను’’ అని తెలిపారు.

ఓటీటీ

ఇది చూడొచ్చు

ఈ కలయిక కాస్త ఘాటు గురూ...

ఓటీటీలో ‘ఇది చూడొచ్చు’ అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం ‘ది యూనియన్’ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఎక్కడైనా ప్రేమికులు చాలా ఏళ్ల తరువాత కలిస్తే, చాలా హాట్ హాట్‌గా ఉంటుంది. కానీ ఈ ‘ది యూనియన్’ సినిమాలో పాత ప్రేమికులు కలిసిన తరువాత ఇంత ఘాటా అని చూసే ప్రేక్షకుడు నోరెళ్లబెట్టాల్సిందే. అంతలా ఏముందీ సినిమాలో ఓసారి విశ్లేషించుకుందాం. జూలియన్ ఫరియానో దర్శకత్వం వహించిన స్పై కామెడీ థ్రిల్లర్ సినిమా ‘ది యూనియన్’. నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో తెలుగులోనూ ఈ సినిమాని చూడవచ్చు. హేమాహేమీలైన హాలీబెర్రీ, మార్క్ వాబర్గ్, మైక్ కాల్టర్ నటించిన ఈ సినిమా పెద్దలకు మాత్రమే. ఇక ఈ సినిమా కథాంశానికొస్తే... కథానాయకుడు మైక్ మెకన్నా న్యూజెర్సీ నగరంలో ఓ సాధారణ బిల్డింగ్ కార్మికుడు. రోజువారీ కష్టంతో తన పనేదో తాను చూసుకుపోయే మనస్తత్వం గలవాడు. కాకపోతే కాస్తంత అమ్మాయిల పట్ల పిచ్చి ఎక్కువ. హాయిగా సాగుతున్న మైక్ జీవితంలో అనుకోని ఓ అవాంతరం తన హైస్కూల్ క్రష్ అయిన రోక్సేన్ హాల్ ద్వారా ఎదురవుతుంది. 25 ఏళ్ల తరువాత కలిసిన తన ప్రేమను గుర్తు చేసుకుంటూ డాన్స్ చేస్తూ స్పృహ తప్పుతాడు మైక్. అలా న్యూజెర్సీలో స్పృహ తప్పిన మైక్ తిరిగి కళ్లు తెరిచేసరికి లండన్‌లో ఉంటాడు. మరోపక్క ఓ బ్రీఫ్‌కేస్ కోసం ఇరాన్ తీవ్రవాదులు, నార్త్ కొరియా ఏజెంట్లు, రష్యన్ గూఢచారులు తెగ వెతికేస్తుంటారు. ఆ బ్రీఫ్‌కేస్‌లో చాలా సెన్సిటివ్ ఇన్ఫర్మేషన్ ఉంటుంది. దాని కోసం యూనియన్ అనే సంస్థ తమ ప్రతినిధులను చాలా మందినే పోగొట్టుకుంటుంది. అసలు ఆ బ్రీఫ్‌కేస్‌కి, కథానాయకుడు మైక్‌కి సంబంధం ఏంటి? 25 ఏళ్ల తరువాత మైక్ ప్రియురాలు రోక్సేన్ హేల్ అతన్ని ఎందుకు కలిసింది? కలిసిన తరువాత అతను లండన్‌లో ఉండడం ఏంటి? అయినా ఓ ప్రేమికుల కలయికలో ఇంత ఘాటైన ట్విస్టులా? వీటి సమాధానాల కోసం ‘ది యూనియన్’ సినిమా చూడాల్సిందే. ఈ సినిమా ప్రేక్షకుడిని గిలిగింతలు పెట్టిస్తూ ఆద్యంతం థ్రిల్లింగ్ కలిగిస్తుందనడంలో సందేహం లేదు. వీకెండ్ మస్ట్ వాచ్ మూవీ ‘ది యూనియన్’.

– ఇంటూరు హరికృష్ణ